## క్లుప్తంగా

### కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్

కై లాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని 13వ వార్డు సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు కాలనీవాసులతో కలిసి ఆ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ ఆదిలాబాద్ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పార్టీ అధిష్టాన పెద్దలతో మాట్లాడి అధిక నిధులు తీసుకువస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికలు ఏవైనా కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు శ్రీధర్, వెంకట్‌రెడ్డి, ఆశమ్మ, నగేశ్, దేవిదాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు



వృద్ధులకు పండ్లు అందజేస్తున్న నాయకులు

తలమడుగు: పీఆర్టీయూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లింగి గ్రామంలో వృద్ధాశ్రమంలో నాయకులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మోహన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు అడే నూర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నర్రా నవీన్‌జాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి బాబన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాశ్, జిల్లా కోశాధికారి ముజీబ్, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్, సిరికొండ మండల అధ్యక్షుడు దినేశ్, నేరడిగొండ మండల అధ్యక్షులు అంబారావు, చంద్రశేఖర్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవిరాజ్ పాల్గొన్నారు.

### పోలీసు కవాతు



బజార్‌హత్నూర్‌లో పోలీసు బలగాల కవాతు

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి, బజార్‌హత్నూర్, గిర్నూర్, పిప్రి గ్రామాల్లో బోథ్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు, సీఆర్పీ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు. ఎస్సై బి.నరేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొడ్డు వెంకటరమణ, కోశాధికారిగా పోరెడ్డి రాజేందర్, కార్యదర్శి బండారి దశరథ్, సలహాదారుగా కొడారి రవి, మాండ అశోక్, ఆరే రాజేశ్వర్, అంగ నారాయణ ఎన్నికయ్యారు.

### చలివేంద్రం ప్రారంభం




నీళ్లు పోస్తున్న మాల సంక్షేమ సంఘ నాయకులు

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు అల్లూరు భూమన్న,మండల అధ్యక్షుడు క్రాంతి, జిల్లా నాయకులు రమేశ్, ప్రశాంత్, సత్యనారాయణ, రాహుల్, మండల నాయకులు రమేశ్, దత్తు, గజనంద్, ప్రకాశ్, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

### హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను గ్రామస్తులు మంగళవారం ప్రారంభించారు. ఈ లైట్లు ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ఉగాది వేడుకలు



తలమడుగు: పంచాంగ శ్రవణం వినిపిస్తున్న వేద పండితులు



నేరడిగొండ: పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పంచాంగ శ్రవణంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



ఉగాది పచ్చడి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్



నార్నూర్: మామిడాకులతో విస్తరాకు తయారు చేస్తున్నా ఆదివాసి గిరిజనులు



బజార్‌హత్నూర్: దేగామలో..

ఆదిలాబాద్‌టౌన్/నేరడిగొండ/ఇచ్చోడ/బేల/ఉట్నూర్‌రూరల్/తలమడుగు/తాంసి/బజార్‌హత్నూర్/నార్నూర్/ఇంద్రవెల్లి/ఆదిలాబాద్‌రూరల్/సిరికొండ: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను జిల్లాప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. భక్తులు ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఇళ్లల్లో మహిళలు షడ్రుచులతో పచ్చడి తయారీ చేశారు. చేలల్లో రైతులు పూజలు నిర్వహించి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. పంటలు సంవృద్ధిగా పండాలని వేడుకున్నారు.

- జిల్లాకేంద్రంలోని వినాయక్ చౌక్‌లో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఉగాది పచ్చడి, గుడాల పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించారు.
- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన వేడుకల్లో మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామి, ప్రకాశ్‌రెడ్డితోపాటు పలువురు వ్యాపారులు, వైద్యులు పాల్గొన్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, గుడాలు పంపిణీ చేశారు. ఉగాది, రంజాన్ పండుగలు పురస్కరించుకొని పేద మహిళలకు సమితి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో మాజీమంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు. వేదపండితులు పంచాంగ శ్రవణం వినిపించారు.
- నేరడిగొండ మండలం రాజూరా గ్రామంలో సంత్ శ్రీ సేవాలాల్ జగదాంబదేవి ఆలయంలో గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చేలకు వెళ్లి వెళ్లి అరక పట్టి సాగు పనులు ప్రారంభించారు. తర్వాత నేరడిగొండలోని శివాలయంలో పూజలు చేశారు.
- ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణలు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం పట్టణ కేంద్రంలో నూతన ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరని రాజేశ్ దంపతుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.



ఇంద్రవెల్లి: సాకేరలో చేలలో..



బేల: బురాన్‌పూర్ శివారులో..



మహిళలకు చీరలు అందిస్తున్న సమితి సభ్యులు



పచ్చడి పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

### అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఉగాది సందర్భంగా మండల కేంద్రంలో నూతన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని కుటుంబ సభ్యులు, పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

### వ్యవసాయంలో ఆదర్శ గ్రామం జామిడి



రైతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: వ్యవసాయంలో రాణిస్తూ ఆదర్శ గ్రామంగా జామిడి నిలుస్తోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని మంగళవారం జామిడిలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొని పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలో అధిక పంట దిగుబడులు సాధిస్తున్న రైతులు శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, స్వామిని ఎమ్మెల్యే సన్మానించారు. వీరితోపాటు ఏఈవో, పంచాయతీ కార్యదర్శి, బ్యాంక్ అధికారులను గ్రామస్తులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని రైతుల సౌకర్యార్థం గోదాంని నిర్మిస్తామన్నారు. గ్రామశివారులో చెరువు లీకేజీకి మరమ్మతు చేపడుతానని తెలిపారు. ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ కేశవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రఘు, బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ఏఈవో శివకుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వినోద్ రెడ్డి, రాంరెడ్డి, అమర్‌రెడ్డి, బాబురెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, నాయకుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పోలీసుల ముందస్తు చర్యలు
- మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా

నేరడిగొండ: ఎన్నికలు అంటేనే చాలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం సాధారణం. తమ పార్టీ అభ్యర్థులే గెలువాలనే తపన అందరిలో ఉంటుంది. అలాంటి సమయంలో అనేక తగువులు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి. అయితే మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అలా జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. కోడ్ వచ్చిన నాటి నుంచి వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో తగువులు చోటుచేసుకోకుండా అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఓటర్లను ప్రభావితం చేసేవాటిపై నిఘా**

ఎన్నికల సమయంలో అనేక మంది నాయకులు తమ పార్టీ నాయకులకు ఓట్లు వేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తుంటారు. అందులో గోడలపై అనేక వాగ్దానాలతో కూడిన రాతలు రాయకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఎవరైనా రాసి ఉంటే వాటిని తుడిపించడంతోపాటు పార్టీ జెండాలకు, నాయకుల విగ్రహాలకు ముసుగులు తగిలించారు. వాటితో పాటు ఏ ఒక్క గ్రామంలో కూడా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేపట్టవద్దని నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచిస్తున్నారు.

**మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు మద్యం విక్రయాలు నిషేధించాలని అధికారులు నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా గతంలో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయించే వారిని పిలిపించి విక్రయించకుండా కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతోపాటు పలువురిని స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి మద్యం విక్రయిస్తే పీడీ యాక్టు కేసు నమోదుతో పాటు, రూ.2లక్షల జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. మద్యం దుకాణాల యజమానులు ఒక వ్యక్తికి ఎంత మద్యం అవసరమో అంతే విక్రయించాలని, అధిక మొత్తంలో విక్రయిస్తే షాపుపై కేసులు తప్పవని సూచించారు. మద్యం విక్రయించినా వ్యక్తికి విధిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.



రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం

**పాత నేరస్తులపై పర్యవేక్షణ..**

ఎన్నికల సమయంలో తగాదాలకు సిద్ధపడే పాత నేరస్తులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. వారందరినీ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. పోలీసులు పిలిచిన సమయంలో స్టేషన్ వచ్చి వెళ్లాలని, ఎలాంటి సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో గతంలో దాడులకు పాల్పడిన అనేక మంది మళ్లీ ఆలాంటి ఘటనలకు పాల్పడకుండా ఉండేందుకు జాగ్రత్త పడుతున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### మద్యం విక్రయిస్తే కేసులు



ఎన్నికల సమయంలో గ్రామాల్లో మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధించాలి. ఎవరైనా గతంలో మాదిరిగా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయిస్తే పీడీ యాక్టు కేసు నమోదుతోపాటు జరిమానా విధిస్తాం. ఇప్పటికే వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. అంతేకాకుండా పాత నేరస్తులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– రమేశ్, సీఐ, బోథ్

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎన్నికల సందర్భంగా విధించిన నిబంధనలను ఏ ఒక్కరు అతిక్రమించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే అనేక మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయించొద్దని సూచించాం. ఎవరైనా విక్రయిస్తే పీడీ యాక్టు కేసు నమోదు చేస్తాం.

– శ్రీకాంత్, ఎస్సై, నేరడిగొండ

### ఎగిసిపడుతున్న భగీరథ నీరు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పంప్‌హౌస్ వెళ్లే పైపులైన్ వాల్ వద్ద లీకేజీతో మంగళవారం సాయంత్రం మిషన్ భగీరథ నీరు ఎగిసిపడింది. రోడ్లపై నీరు చేరి వృథాగా పోయింది. పంప్‌హౌస్ నుంచి ఇచ్చోడ మండలానికి భగీరథ నీటి సరఫరా అవుతుంది. ఈ సంఘటన చోటుచేసుకున్నా తర్వాత కూడా అధికారులు స్పందించక పోవడంపై చర్చనీయాంశమైంది.



# రాంజీగోండ్ ఆశయాలు కొనసాగించాలి



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు



ఆదిలాబాద్ రూరల్: రాంజీగోండ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



గుడిహత్నూర్: నివాళులర్పిస్తున్న ఆదివాసీ సేనా నాయకులు

ఇచ్చోడ: రాంజీగోండ్ ఆశయాలు కొనసాగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మంగళవారం ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంజీ గొండ్ పోరాట యోధుడు అని కొనియాడారు. ఆదివాసీ సంఘం నాయకులు ఆత్రం మహేందర్, సిడాం మురళీకృష్ణ, పెరమండ్ల గంగాయ్య, భీముడు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: రాంజీగోండ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు బి.రాహుల్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆ ఫోరం ఆధ్వర్యంలో రాంజీగోండ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫోరం ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తెఖారొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: జామ్ని గ్రామంలో రాంజీగోండ్ వర్ధంతిని నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు సోయం అవినాష్, నాయకులు కృష్ణ, నైతం సోము, పెందూర్ మోహన్, కుమ్ర ఆనంద్ రావ్, పెందూర్ భరత్, మడావి సోనేరావ్, మేస్రం షేక్ ఫరీద్, మడావి ధర్ము, కుమ్ర సంతోష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వడగామ్ చౌక్ వద్ద గొండ్‌గూడ ఆదివాసీల ఆధ్వర్యంలో రాంజీగొండ్ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా గొండ్‌గూడ నుంచి సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ రాంజీగొండ్ స్మారక జెండా పూజలు నిర్వహించారు. అనంతరం రాంజీగొండ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గొండ్‌గూడ గ్రామ పటేల్ మడావి ఇంద్రు, గ్రామపెద్దలు చహకటి నాగోరావ్, కుడ్మేత గోద్రు, లచ్చు, లాల్‌షావ్, మెస్రం మహాదు, మడావి నాగోరావ్, శ్రీకాంత్ ఉన్నారు.

గుడిహత్నూర్: రాఘాపూర్‌లో ఆదివాసీ సేనా నాయకులు రాంజీగోండ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆదివాసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావ్ మొకాశి, జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు, ఏఈఎఫ్ జిల్లా కన్వీనర్ కుంరం దశరథ్, ఆదివాసీ విద్యార్థి సేనా జిల్లా కన్వీనర్ శత్రుఘన్, కేడీఆర్ సైన్యం అధ్యక్షుడు కాత్లే బుచ్చన్న తదితరులు ఉన్నారు.

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో కుమ్రం భీమ్ భవనంలో రాంజీగోండ్ వర్ధంతిని నిర్వహించారు. ఇందులో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్, నాయకులు కొడప సురేశ్, విజయ్, సంతోశ్, రాజు పాల్గొన్నారు.

బోథ్(నేరడిగొండ): సొనాల మండలం పార్డి(కె) గ్రామంలో రాంజీగోండ్ వర్ధంతిని నిర్వహించారు. అమృత్‌రావు పటేల్, జైతు దేవరి, మెస్రం భూమన్న, మదన్, అనిల్, జయతు, దశరథ్, మహేష్ నవీన్ పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్‌లో పాల్గొన్న కంది శ్రీనివాసరెడ్డి



ఇఫ్తార్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని జామ మసీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ముస్లిం మతపెద్దలు తదితరులు ఉన్నారు.

కైలాస్‌నగర్: కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో నిర్వహించిన ఈ విందుకు ముస్లింలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రజా సేవాభవన్ వేదికని ఉదయం ఉగాది వేడుకలు, సాయంత్రం ఇఫ్తార్ విందు జరగడం హర్షనీయమన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులు సోన్‌కాంబ్లే మనోహర్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

### లంబాడాల ఐక్యవేదిక కన్వీనర్‌గా వసంత్‌రావు

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ లంబాడాల ఐక్యవేదిక కన్వీనర్‌గా బానోత్ వసంత్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్, రాష్ట్ర సమన్వయకర్త గూగులోత్ రమేశ్ నాయక్ ప్రకటించారు.

### సప్తాహం పోస్టర్ ఆవిష్కరణ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని అతి పురాతన శివాలయం వద్ద ఏటా నిర్వహించే హరినామా సప్తాహం ఈనెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ధరమ్‌పాల్ అగర్‌వాల్, సభ్యులు వామన్‌గిత్తే, లక్ష్మణ్ కేంద్రే, సంజీవ్ ముండే, గోపినాథ్ గిత్తే, మాధవ్ కేంద్రే, చాటే సంభాజీ, రావణ్ ముండే, జాదవ్ రమేశ్ ఉన్నారు.

### పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

బజార్‌హత్నూర్: పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై నరేశ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివిధ మతాల సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండగలను సోదరాభావంతో కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. సమావేశంలో నరేందర్, సంతోష్, రహుఫ్, యూసుబ్‌ఖాన్, రియాజ్, అజాం, మజార్, షఫీ, సలీమ్, కలీం, అబ్బు, సాధిక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై నరేశ్